Radha Publications
Contact : 8328119133
9849568581

www.srujana.net
SRUJANA KRANTHI
# సృజన క్రాంతి
ప్రజల పక్షాన అక్షరకాంతి

epaper.
srujana.net

Published From : Rangareddy / Hyderabad | ప్రచురణ : రంగారెడ్డి/హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 132 | తేది : 06-07-2024, శనివారం | పేజీలు : 8 | వెల రూ.4/

# నేడు ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ



### ప్రగతి భవన్ లో అధికారుల ఏర్పాట్లు పూర్తి
### విభజన సమస్యలపై చర్చించే అవకాశం
### షెడ్యూలు 9, షెడ్యూలు 10 సంస్థల విభజనపై చర్చ!
### విద్యుత్తు సంస్థలకు బకాయిలపైనా చర్చలు

**సృజనక్రాంతి/హైదరాబాద్** : రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశానికి సమయం దగ్గర పడుతోంది.. ఇప్పటికే ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. మరోవైపు.. హస్తిన పర్యటన ముగించి.. హైదరాబాద్‌లో అడుగుపెట్టనున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.. ఇక, నేడు ప్రజా భవన్ వేదికగా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సమావేశం కాబోతు న్నారు.. ఈ నెల ఆరో తేదీన భేటీ అవుదామనే ప్రతిపాదనను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ముందుంచారు ఏపీ సీఎం.. దానికి అంగీకరించారు తెలంగాణ ముఖ్యమంత్రి.. అయితే, ఈ భేటీలో ఏ అంశాలపై చర్చ సాగనుంది అనేది ఆసక్తికరంగా మారింది.. ముఖ్యంగా తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన బకాయిలు ఏమున్నాయనే కోణంలో ఏపీ ప్రభుత్వం సమాచారాన్ని సేకరిస్తున్నట్టు తెలుస్తోంది.. షెడ్యూల్ 9,10 పరిధిలోని సంస్థల విభజన.. ఆస్తుల పంపకాల వంటివి ఇంకా తేలాల్సి ఉంది. ఆర్టీసీ ఆస్తుల విభజన జరగకపోవడం కీలకమైన వ్యవహారంగా ఉంది. అలాగే ట్రాన్సుకో, ఉన్నత విద్యా మండలి, పట్టాణభివృద్ధి శాఖ పరిధిలోని ఏపీ హౌసింగ్ బోర్డు నుంచి కొన్ని వేల కోట్ల రూపాయల మేర పెండింగ్ బకాయిలు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏపీకి రావాల్సి ఉంది. ఈ అంశాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నట్టు సమాచారం.. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న క్రమంలో తెలంగాణ నుంచి రావాల్సిన నిధుల్లో కొంత మొత్తం వచ్చినా.. ఏపీకి కాస్తో కూస్తో ఆర్థిక ఊరట ఉంటుందనేది ప్రభుత్వ పెద్దల భావనగా ఉందట%ా% దీంతో పాటు.. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి వివాదాలు.. నదీ జలాల వాటాల గొడవలు.. డిస్కంలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల గొడవ వంటివి కూడా సీఎంల భేటీలో ప్రస్తావనకు తెచ్చేలా ఏపీ ప్రభుత్వం సిద్దమవుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, ఇప్పటికీ కొంత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అక్కడి వారు ఇక్కడ.. ఇక్కడి వారు అక్కడ అనే రీతిలో పని చేస్తున్నారు. ఏపీకి అలాట్ చేసిన వారు కూడా తెలంగాణలో పని చేస్తున్న పరిస్థితి. అలాంటి వారి విషయంలో ఏం చేయాలనే దానిపై క్లారిటీకి రావాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఏపీ నుంచి తమను రిలీవ్ చేయాలని తెలంగాణ ఉద్యోగుల కోరుతున్నారు. ప్రస్తుతం ఏపీలో 712 మంది స్థానికత ఉన్న ఉద్యోగులు పని చేస్తున్నారు. సచివాలయం, హెచ్వోడీలు, 9, 10వ షెడ్యూల్ సంస్థల్లో పని చేస్తున్న 224 మంది రాష్ట్ర కేడర్ ఉద్యోగులను కూడా రిలీవ్ చేయాలని కోరుతోన్నారు ఏపీలోని తెలంగాణ ఉద్యోగులు. సీనియార్టీ కొల్పోయినా ఫర్వాలేదని.. తమను తమ రాష్ట్రానికి పంపాలని తెలంగాణ ఉద్యోగులు అంటున్నారు. విభజన జరిగి పదేళ్లైనా స్థానికత ఆధారంగా తమను స్వరాష్ట్రానికి పంపకపోవడంపై తెలంగాణ ఉద్యోగుల ఆవేదన చెందుతున్నారు. తమ విజ్ఞప్తులను పరిష్కరించాలని రెండు రాష్ట్రాల సీఎంలను అభ్యర్థిస్తు న్నారు ఏపీలోని తెలంగాణ ఉద్యోగులు. ఈ విషయం మీద సీఎంల భేటీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక అన్నిం టికంటే ముఖ్యం.. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రతి అంశంలోనూ గొడవలు పడుతూ ఉంటే.. కేంద్రం జోక్యం అనివార్యమవుతుంది. దీంతో పరిస్థితి మరింత జఠిలం కావడం తప్ప.. సమస్య సులువుగా పరిష్కారం కాదనేది ప్రభుత్వ పెద్దల ఆలోచన. దీంతో ముందుగా ఈజీగా సాల్వ్ అయ్యే పరిష్కారాలేంటో చూసుకుని.. వీలైనంత త్వరగా మెజార్టీ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తుందట.. అయితే, ఈ భేటీలో రెండు రాష్ట్రాల సీఎంలతో పాటు.. ఇంకా ఎవరెవరు పాల్గొంటారు.. అజెండా ఏంటి అనేదానిపై మాత్రం మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

# ఏపీ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తాం

**గత ఐదేళ్లలో రాష్ట్రానికి సరిదిద్ద లేనంత నష్టం**
**ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని బాగు చేస్తుంది**
**మీడియాతో సిఎం చంద్రబాబు నాయుడు**

**సృజనక్రాంతి/అమరావతి** : ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీలో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఏపీ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి సరిదిద్ద లేనంత నష్టం జరిగిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని బాగు చేస్తుందని అన్నారు. ఏపీ గ్లోబల్ లీడర్ గా తయారు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దక్షిణాదిలో ఏ రాష్ట్రానికి లేనన్ని గొప్ప వనరులు ఏపీకి ఉన్నాయి.. కృష్ణా గోదావరి నదులు రాష్ట్రం గుండా వెళ్తున్నాయి.. ఒక్క గోదావరి నది నుంచి 3 వేల టీఎంసీల నీరు సముద్రం పాలు అవుతుంది.. ఆ నీటిని వినియోగించుకుంటే దక్షిణాది మొత్తానికి నీటిని ఇవ్వొచ్చని తెలిపారు.కేంద్రం నుంచి ఎలాంటి పదవులు ఆశించలేదు.. పదవుల కోసం డిమాండ్ చేయలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. వాజ్ పేయి హయాంలో 7 మంత్రి పదవులు ఇస్తామన్న తీసుకోలేదు.. ఒక్క స్పీకర్ మాత్రమే తీసుకున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవి అడగలేదు.. వాళ్ళు ఇస్తామనలేదని తెలిపారు. తమకిచ్చిన మంత్రి పదవుల పట్ల తాము సంతోషంగా ఉన్నామని అన్నారు. మరోవైపు.. ఐదేళ్ల జగన్ పాలన వల్ల అమరావతి ప్రాముఖ్యత తగ్గింది.. అమరావతికి ప్రాముఖ్యత తీసుకు వచ్చేలా పనిచేస్తామన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వ పరంగా కావాల్సిన మౌలిక వసతుల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. దశల వారిగా నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు చంద్రబాబు.ఐదేళ్లలో శాశ్వత అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్య గణన చేపడతామని.. అందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అంతేకాకుండా.. మానవ వనరులను మూలధన వనరులుగా మార్చి సంపద సృష్టిస్తామని చెప్పారు. అమరావతి నిర్మాణం నిరంతర ప్రక్రియ.. మరోవైపు.. తెలంగాణ సీఎం రేవంత్ తో సమావేశంలో ఇరు రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యలు పరిష్కరించుకోవలనేది తమ లక్ష్యమని తెలిపారు. ఏపీలో పెట్టుబడులకు ఇబ్బంది లేదు.. ఈ ఏడాది దావోస్ కి వెళ్తా.. ఏపీకి పెట్టుబడులు తెస్తామని చంద్రబాబు చెప్పారు.



## తెలంగాణ సిఇవోగా సుదర్శన్ రెడ్డి

**సృజనక్రాంతి/హైదరాబాద్** : తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)గా సుదర్శన్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఈసీ ఉత్తర్వులు వెలు వరించింది. ప్రస్తుత సీఈవో వికాస్‌రాజ్‌ను ఈసీ రిలీవ్ చేసింది. నూతన సీఈవోగా నియమితులైన సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం జీఏడీ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం జీఏడీ సర్వీసెస్‌లో సుదర్శన్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.

## విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్

**వచ్చే నెల నుండి అందుబాటులోకి..**

న్యూఢిల్లీ : ఆర్‌బిఐ మార్గదర్శకాలను ఉటంకిస్తూ జూలై 1న తమ వినియోగదారులను విద్యుత్తు అధికారిక వెబ్‌సైట్ , మొబైల్ యాప్ ద్వారా నెలవారీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరిన తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ( టిజిఎస్‌పిడిసిఎల్ ) విద్యుత్ బిల్లులపై చెల్లింపులు చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ముద్రించాలని యోచిస్తున్నట్లు సమాచారం. సమాచారం ప్రకారం, కోడ్‌తో కూడిన బిల్లులు వచ్చే నెల నుండి వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా %ు=% కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి బిల్లులను చెల్లించవచ్చు. కొత్త నిబంధనల వల్ల బిల్లుల వసూళ్లపై ఇప్పట్లో ప్రభావం పడలేదని డిస్కమ్ అధికారులు పేర్కొంటున్నారు . శుక్రవారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 1.20 లక్షల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌ను బలహీనపరుస్తున్న కాంగ్రెస్

### డైలమాలో పడ్డ బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్
### ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరికతో విస్మయం

**సృజనక్రాంతి/హైదరాబాద్** : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనాటికి ఎమ్మెల్యేల బలం పెంచుకునేందుకు రేవంత్ సర్కార్ వ్యూహాత్మకంగా పథకాలు రచిస్తోంది. అందులో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ బీఆర్‌ఎస్ ను మానసికంగా బలహీనంగా మార్చేస్తోంది. కనీసం ఆ పార్టీ నుంచి ఎవరెవరు కాంగ్రెస్ లో చేరుతున్నారో కూడా తెలియనీయకుండా..లీకులకు బ్రేకులు వేసి మరీ చేర్చుకుంటోంది. సొంత పార్టీ నేతలే ఒకరిని ఒకరు అనుమానాస్పదంగా చూసుకునే పరిస్థితి ఏర్పడింది బీఆర్‌ఎస్ కు. అసలేం జరుగుతోందో తెలియని డైలమాలో ఉంది ఆ పార్టీ క్యాడర్ మొత్తం. ఇలాంటి పరిస్థితిలో బీఆర్?ఎస్?కు మరో భారీ దెబ్బ తగిలింది. గురువారం అర్ధరాత్రి ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్సీలు ఒకేసారి కాంగ్రెస్‌లో చేరడం సంచలనం రేపింది. ఎక్కడా కూడా హడావుడి లేకుండా, ఎలాంటి ముందస్తు ఊహాగానాలకు తావివ్వకుండా ఎమ్మెల్సీల చేరిక జరిగింది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్?తో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాసు మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలు ఉన్నారు. ఇకపై కంటిన్యూగా జాయినింగ్స్ ఉంటాయని టీపీసీసీకి చెందిన నేతలు చెబుతున్నారు.. తమ టార్గెట్ 25 మంది ఎమ్మెల్యేలని, ఇప్పటికే ఆరుగురు చేరగా, త్వరలో మిగతా వారంతా చేరుతారని చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలతో కలుపుకుంటే ప్రస్తుతం అధికార పార్టీ సభ్యుల సంఖ్య 71కి చేరుకుంది. కాగా తెలంగాణ శాసన మండలిలో కూడా ఆధిక్యం కోసం కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40. ప్రస్తుతం 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఆరుగురు మాత్రమే సభ్యులు న్నారు. తాజాగా ఆరుగురు సభ్యులు చేరడంతో వారి బలం 12కు చేరింది. వామపక్ష ఎమ్మెల్సీ మద్దతుతో కలిపితే 13కు చేరుతుంది. కాంగ్రెస్ పార్టీకి మరో ఐదారు సీట్లు ఉంటే మండలిలో కూడా మెజారిటీ దక్కుతుంది. ప్రస్తుతం తెలంగాణ మండలిలో బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నారు. కీలక బిల్లులను నెగ్గించుకునే రేవంత్ ప్రభుత్వం ఇబ్బందులు లేకుండా ముందుకు సాగే వీలుంటుంది. బీఆర్?ఎస్? ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, భాను ప్రసాద్, దండె విఠల్, ఎం.ఎస్ ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్ పార్టీ మారారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ హోటల్ సమావేశమైన వారు రాత్రి 12 గంటల సమయంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి హస్తిన పర్యటన ముగించుకుని ఇంటికి చేరుకోగానే వారు పార్టీలో చేరారు. సీఎం ఢిల్లీ నుంచి వచ్చిన నిమిషాల్లోనే చేరికల కార్యక్రమం చకచకా పూర్తవడం గమనార్హం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లో చేరబోతున్నారని గత కొన్ని రోజుల నుంచి పొలిటికల్ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. ఫలానా ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారంటూ మీడియా సర్కిళ్లలోనూ డిస్కషన్స్ జరుగుతూనే ఉన్నాయి. కానీ పార్టీ తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలతో ఎవరు, ఎప్పుడు పార్టీ చేంజ్ అవుతున్నారనే విష యం ఇటు పబ్లిక్‌తో పాటు పార్టీ నేతలకూ తెలియ దం లేదు. సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ప్రతిపక్ష పార్టీలకు చిక్కకుండా అమలవుతున్నాయని కాం గ్రెస్ పార్టీ నేతలు సంతోష పడుతున్నారు. తాను పార్టీ మారడం లేదని స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పిన దానం నాగేందర్.. ఆ మరుసటి రోజే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన తాను కార్యకర్తల మనోభావాలు దెబ్బతీయనని చెప్తూనే భద్రాచలం ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరారు. తాము పార్టీ మారే ప్రసక్తే లేదని స్ట్రాంగ్ గా చెప్పిన పోచారం శ్రీనివాసరెడ్డి సైతం కాంగ్రెస్ కండుమా మార్చుకున్నారు. ఇలా మొదటినుంచి తాము పార్టీ మారమని చెబుతూనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో బీఆర్‌ఎస్ పార్టీలో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో.. తెలియడం లేదు.



# బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ అద్భుత విజయం

**స్టార్మర్‌కు ప్రధాని మోదీ అభినందనలు**

న్యూఢిల్లీ : బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ అద్భుత విజయం సాధించింది. 14 సంవత్సరాల కన్జర్వేటీవ్ పార్టీ పాలన ముగిసింది. లేబర్ పార్టీ విజయంలో ప్రధాని అభ్యర్థి కీర్ స్టార్మర్ కీలక పాత్ర పోషించారు. 650 సీట్లు ఉన్న పార్లమెంట్‌లో లేబర్ పార్టీ ఇప్పటివరకు 412 స్థానాలను గెలుచుకుంది. రెండు శతాబ్దాల చరిత్రలో కన్సర్వేటీవ్ పార్టీ ఘోర ఓటమిని చవిచూసింది. లేబర్ పార్టీ విజయంపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. బ్రిటన్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించిన లేబర్ పార్టీ ప్రధాని అభ్యర్థి కీర్ స్టార్మర్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. అలాగే కన్జర్వేటీవ్ పార్టీ ఓటమికి సంబంధించి బ్రిటన్ మాజీ పీఎం రిషి సునాక్ నాయకత్వాన్ని కొనియాడారు. రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో రిషి సునాక్ కీలక పాత్ర పోషించారని మోదీ పేర్కొన్నారు. కీర్ స్టార్మర్ అద్భుతమైన విజయం సాధించారని.. రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి నిర్మాణాత్మక సహకారం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. గత ప్రధాని రిషి సునాక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు ప్రధాని మోదీ. రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు రిషి సునాక్ క్రియాశీలక సహకారం అందించారని.. అతని నాయకత్వం అద్భుతమైనదని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు ప్రధాని మోదీ. బ్రిటన్ ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తున్నట్లు కన్జర్వేటీవ్ పార్టీ నేత రిషి సునాక్ చెప్పారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన లేబర్ పార్టీకి అభినందనలు తెలిపారాయన. లేబర్ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన కీర్ స్టార్మర్‌కు అభినందనలు తెలియజేశారు.

## భ్రాంతి -క్రాంతి

### కలుషితం

స్వార్థం సకల నాడుల్లో నిండి
సౌకర్యాల మాయలో పడి
కాంక్రీట్ సౌధాలే సర్వమనుకొని
చుట్టూ వైఫై లా కాలుష్యాన్ని నింపుకొన్న
మనుషుల మనసులు కలుషితం
నీ మరణ శాసనాన్ని నువ్వే
రాసుకుంటున్న ఓ మనిషి
దేహాన్ని సుఖపెట్టాలనే లాలసతో
ప్రాణాన్ని పణంగా పెడుతున్నావు
మేలుకోకపోతే మరణంతో
నిత్యం యుద్ధమే..!

- కర్ణ



## సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

హైదరాబాద్ /కరీంనగర్ : సింగరేణి బొగ్గు క్షేత్రాల వేలానికి నిరసనగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద వామపక్షాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి . సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యకర్తలు నిరసనలో పాల్గొని సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్దపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యకర్తలను రామగుండం , ఎన్టీపీసీ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు . కరీంనగర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బొగ్గు బ్లాకులను వేలం వేసి సింగరేణిని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. ఎస్‌సిసిఎల్‌ను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోడీ గోదావరిఖని పర్యటనలో స్పష్టం చేశారు. అయితే, ఆయన ఇచ్చిన మాటకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సింగరేణిలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు సహా దాదాపు 1.25 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, సింగరేణి తెలంగాణకు జీవనాడి అని, సంస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను సీపీఐ నేతలు నొక్కి చెప్పారు. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు తెలంగాణ బిడ్డ (తెలంగాణ బిడ్డ) అని చెప్పుకుంటున్న కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

**సృజనక్రాంతి/అమరావతి** : ఎమ్మెల్సీలుగా సి. రామచంద్రయ్య, పి. హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ పదవుల కోసం వీరు నామినేషన్ దాఖలు చేశారు. ఇతర నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఈ ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిజర్నింగ్ అధికారి ప్రకటించారు.

## జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తాం రేవంత్ రెడ్డి హామీ

**నిరుద్యోగ యువత నిరసనలపై స్పందించిన ముఖ్యమంత్రి**

**సృజనక్రాంతి/హైదరాబాద్** : జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత నిరసనలపై ఆయన శుక్రవారం స్పందించారు. వారి ఆందోళనలు, డిమాండ్లపై చర్చించారు. పార్టీకి చెందిన విద్యార్థి, యువజన, నేతలు, అధికారులతో ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కొన్ని పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచించారు. అసెంబ్లీ సమావేశాలలో చర్చించిన అనంతరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.



## తగిన ఏర్పాట్లు చేయకనే తొక్కిసలాట

**హాత్రాస్ బాధితులకు రాహుల్ పరామర్శ**

లక్నో : లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ శుక్రవారం హత్రాస్‌ను సందర్శించి, తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించారు. మతపరమైన కార్యక్రమానికి తగిన పోలీసు ఏర్పాట్లు చేయలేదని, ఇదే తొక్కిసలాటకు దారితీసిందని మృతుల బంధువులు చెప్పారని ఆయన తెలిపారు. ఈ విషాదాన్ని రాజకీయం చేయదలచుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది బాధాకరమైన సంఘటన. చాలా మంది మరణించారు. నేను ఈ విషయాన్ని రాజకీయ కోణం నుండి చెప్పదలచుకోలేదు, కానీ పరిపాలనలో లోపాలు ఉన్నాయి, ముఖ్యమైన విషయం ఏమిటంటే? వారు పేదవారు కాబట్టి గరిష్ట పరిహారం ఇవ్వాలి. నష్టపరిహారం విషయంలో జాప్యం జరిగితే ఎవరికీ ప్రయోజనం ఉండదని యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్‌ని కోరుతున్నాను వారు షాక్‌లో ఉన్నారు, నేను వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలనుకున్నానని రాహుల్ గాంధీ సమావేశం అనంతరం తెలిపారు.

# పెద్దఎత్తున విదేశాలకు ఫార్మా ఎగుమతులు

## ఫార్మా రంగానికి కేంద్రంగా హైదరాబాద్
### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ : నగరం నుంచి పెద్దఎత్తున విదేశాలకు ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ఇండియన్ ఫార్మాస్యుటికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఫార్మా క్లస్టర్లను ఓఆర్ఆర్ వెలుపల ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ రంగంలో కొత్త విధానాలు తీసుకువస్తామని తెలిపారు. ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా మారిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.– హైటెక్స్ లో ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాన్ఫరెన్స్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫార్మా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ విదేశాలకు హైదరాబాద్ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పెట్టుబడిదారులకు అన్ని రకాల సౌకర్యం కల్పిస్తామని ఆయన అన్నారు. టెక్నాలజీ అభివృద్ధిలో ఏఐ ఎంతో కీలక పాత్ర పోషిస్తోంది. 73వ ఫార్మా కాంగ్రెస్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు అంశాలు మాట్లాడారు. దేశంలో 35 శాతం ఫార్మా ఉత్పత్తులు తెలంగాణ నుంచే ఉన్నాయని అది రాష్ట్రానికి గర్వకారణమని భట్టి అన్నారు. ప్రతి ఏటా 50వేల కోట్ల విలువైన మెడిసిన్ ఎగుమతి చేస్తున్నాం అన్నారు. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో అసమానమైన చురుకుదనం ప్రదర్శించి, అవిశ్రాంతంగా శ్రమించారని ఫార్మసిస్టుల సేవలను ఆయన కొనియాడారు. ఫార్మా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుంది అన్నారు. హైదరాబాద్ బిర్యానీకి ప్రసిద్ధి, ఇప్పుడు బిర్యానీతోపాటు బయో ఫార్మా ఉత్పత్తులకు ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అందుబాటులో తీసుకొస్తే దృఢమైన ప్రపంచాన్ని నిర్మించగలమన్నారు. బౌల్ ఆఫ్ ఫార్మగా హైదరాబాద్ స్థిరపడిందన్నారు. సుగంధ ద్రవ్యాలను సరఫరా చేసే స్థాయి నుంచి మానవ జీవితాలను కాపాడే మందుల సరఫరా దశకు తెలంగాణ రాష్ట్రం చేరుకుందన్నారు. ఫార్మా రంగంలో అనేక ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు. ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దేశ, విదేశాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఏఐను అందిపుచ్చుకోవడానికి తగిన విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.వైఎస్ఆర్ హయాంలో ఓఆర్ఆర్ నిర్మించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాంతో హైదరాబాద్‌కు ఎన్నో ఐటీ పరిశ్రమలు వచ్చాయన్నారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం కూడా చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతలో భాగంగా తోడ్పాటు అందించాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

## టూరిస్ట్‌లను ఆకర్షించే విధంగా నల్లమల అభివృద్ధి
### పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**అచ్చంపేట :** దేశంలోని టూరిస్ట్‌లను ఆకర్షించే విధంగా నల్లమల అడవులను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నల్లమలలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి కృష్ణారావు ఇవాళ అచ్చంపేట నుంచి బయలుదేరారు. ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమామహేశ్వరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా రూ, 50 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరం వచ్చే విధంగా ప్రధాన రహదారిపై బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులపాటు నల్లమలలో పర్యటించి పురాతన ఆలయాలతో పాటు టూరిజం పరంగా అభివృద్ధి చేసే ప్రాంతాలను పరిశీలిస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం రంగాపూర్ నిరంజన్ షావలి దర్గాను మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## ప్రభుత్వ వైద్యుడిపై తోటి డాక్టర్ల దాడి
### డీఎంఈ కార్యాలయం ఎదుట బాధిత డాక్టర్ శేఖర్ ఆందోళన

**సృజనక్రాంతి/హైదరాబాద్ :** కోఠిలోని డీఎంఈ కార్యాలయం వద్ద ప్రభుత్వ వైద్యుడిపై తోటి డాక్టర్లు దాడికి దిగారు. దీంతో డీఎంఈ కార్యాలయం ఎదుటే బాధిత డాక్టర్ శేఖర్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సాధారణ బదిలీలను అడ్డుకునేందుకు పలువురు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ముసుగులో ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ సిటీలోనే తిష్ట వేశారని.. వాటిని ప్రశ్నించినందుకే తనపై దాడి చేశారని తెలిపారు. సాధారణ బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు అమలు చేయాలని డీఎంఈకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చానని బాధిత డాక్టర్ శేఖర్ తెలిపారు. ఈ జీవో అమలు చేస్తే 40 శాతం మేర హైదరాబాద్ సిటీలో పని చేస్తున్న వైద్యులు జిల్లాలకు, జిల్లాలలో పని చేస్తున్న వైద్యులు హైదరాబాద్‌కు రావాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఈ బదిలీలను అడ్డుకునేందుకు డాక్టర్ పల్లం ప్రవీణ్ కుమార్, బొంగు రమేశ్, రాథోడ్ , వినోద్ కుమార్ లు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. డీఎంఈకి వినతి పత్రం ఇవ్వకుండా తనను అడ్డుకుని దాడి చేశారని డాక్టర్ శేఖర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ముసుగులో వీరు ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ సిటీలోనే తిష్ట వేశారని ఆరోపించారు. వాటిపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన నలుగురు వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దాడి చేసిన నలుగురు వైద్యులపై సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు
### ఘనంగా స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు

**సృజనక్రాంతి/హైదరాబాద్ :** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చంద్రబాబు తొలిసారి నగరానికి వచ్చిన నేపథ్యంలో పార్టీ నేతలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో చంద్రబాబుకు పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ వద్ద భారీ గజమాలతో సీఎం చంద్రబాబును టీటీడీపీ నేతలు సత్కరించారు. అభిమానులు, క్యాడర్‌కు సీఎం చంద్రబాబు అభివాదం చేశారు. బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి జూబ్లీహిల్స్ నివాసం వరకు భారీ ర్యాలీ తీశారు. పసుపు తోరణాలు, స్వాగత ఫ్లెక్సీలతో చంద్రబాబుకు తెలుగు తమ్ముళ్లు స్వాగతం పలికారు. వర్షంలోనే చంద్రబాబు ర్యాలీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇదిలావుంటే శనివారం జరగనున్న ఇరు రాష్ట్రాల సిఎంల భేటీలో చంద్రబాబు పాల్గొంటారు.

## హైదరాబాద్ శివారులో పార్థీ గ్యాంగ్ పట్టివేత
### పోలీసులపై దాడికి తెగించగా కాల్పులు

**సృజనక్రాంతి/హైదరాబాద్ :** దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్‌ను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో గాల్లోకి కాల్పులు జరిపారు. హైదరాబాద్ శివారు పెద్ద అంబర్‌పేట సమీపంలో ఔటర్ రింగురోడ్డు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల జాతీయ రహదారిపై పార్కింగ్ వాహనాలే లక్ష్యంగా వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో నల్గొండ పోలీసులు అప్రమత్తమై నిఘా పెట్టారు. ఆ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ పోలీసులు దొంగల ముఠాను గుర్తించి వెంబడించారు. ఈ క్రమంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చాక ఇక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. దొంగలను పట్టుకునేందుకు రాచకొండ, నల్గొండ పోలీసులు సంయుక్తంగా యత్నించారు. పెద్దఅంబర్‌పేట సమీపంలోని ఓఆర్ఆర్ వద్దకు వచ్చేసరికి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కత్తులతో ఎదురుదాడి చేయడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకునే క్రమంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ శివారు పెద్ద అంబర్ పేట ఓఆర్ఆర్ వద్ద శుక్రవారం జరిగింది. మహారాష్ట్రకు చెందిన పార్థి గ్యాంగ్ నగర శివారు ప్రాంతాలు, ఒంటరిగా ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడ్డారు. నల్గొండ సీసీఎస్ పోలీసులు వీరిపై నిఘా ఉంచి వీరిని పట్టుకునేందుకు యత్నించారు. ఇదే క్రమంలో పక్కా సమాచారంతో వారిని గుర్తించి పట్టుకునేందుకు ఛేజ్ చేస్తుండగా.. దుండగులు పోలీసులపై కత్తులతో దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో వారిని కట్టడి చేసేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం నలుగురు గ్యాంగ్ సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని నల్గొండకు తరలించారు. దీనిపై విచారణ చేస్తున్నామని.. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

## తెలంగాణ శాసనమండలి ఉనికికి ప్రమాదం
### మండలిలో కనీసం సీట్లు 40 ఉండాలి
### మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్

**సృజనక్రాంతి/హైదరాబాద్ :** తెలంగణ శాసనమండలి ఉనికి ప్రమాదంలో పడిందని మాజీ ఎంపీ బోయిన్‌లపల్లి వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శాసన మండలి పూర్తిగా రద్దు అయ్యే ప్రమాదం ఉంది అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 పకారం శాసన మండలిలో కనీసం సీట్లు 40 ఉండాలని, అంత కంటే తక్కువ ఉండకూడదన్నారు. శాసనసభ సీట్లలో మూడో వంతు కౌన్సిల్ సభ్యులు ఉండాలన్నారు. కేంద్రం ప్రభుత్వం గత టర్మ్‌లో చేసిన రాజ్యాంగ సవరణతో ప్రస్తుతం శాసన మండలి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను తొలగించిందని, దీంతో తెలంగాణ అసెంబ్లీలో శాసనసభ్యుల సంఖ్య 119కి తగ్గిందన్నారు. గత అసెంబ్లీ టర్మ్ ముగిసే వరకు ఆంగ్లో ఇండియన్ పదవీ కాలం ఉందని, దీంతో గత అసెంబ్లీ సమయం ముగిసే వరకు ఎలాంటి ముప్పు రాలేదని వినోద్ కుమార్ తెలిపారు. కానీ కేంద్రం చేసిన రాజ్యాంగ సవరణ కొత్త అసెంబ్లీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఇప్పుడు ఆంగ్లో ఇండియన్ సభ్యుడు అసెంబ్లీలో లేరని దీంతో ఎమ్మెల్యేల సంఖ్య 119 మాత్రేనని, దాని ప్రకారం రాజ్యాంగ నిబంధనలు 1/3 కౌన్సిల్ సభ్యుల సంఖ్య 39కి పడిపోయిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కనీసం 40 మంది సభ్యులు ఉండాలనే నిబంధన ఉల్లఘించినట్లుగా అవుతుందన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు వెళితే వెంటనే మండలి రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. తెలంగాణ శాసన మండలి కొనసాగాలి అంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలని, చంద్రబాబు పస్తుతం కేంద్రంలో కీలకంగా ఉన్నారని, శనివారం నాటి ఇద్దరు సీఎంలు కలిసి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుకు కృషి చేయాలని ఆయన సూచించారు. విభజన చట్టం 26 సెక్షన్ ప్రకారం తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సి ఉందన్నారు. గతంలో అసెంబ్లీ సీట్లను పూనర్విభజన చేయాలని కోరినా కేంద్రం స్పందించలేదని, కుంటి సాకులు చూపిందన్నారు. కానీ జమ్ము కశ్మీర్ లో అసెంబ్లీ సీట్లను పెంచుకున్నారని, కేంద్రానికి ఇష్టం ఉంటే సీట్లను పెంచుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో మాట్లాడి విభజన చట్టంలో పేర్కొన్న విభజన చట్టంలో పేర్కొన్న విధంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే విధంగా చూసి తెలంగాణ మండలి కొనసాగే విధంగా చూడాలన్నారు. శాసనమండలి అవసరమమని, పార్లమెంట్‌లో బిల్లు వచ్చిననాడు తాను సుదీర్ఘంగా ప్రసంగించానని ఆయన గుర్తు చేశారు. శాసనమండలిని కొనసాగించడానికి ప్రయత్నం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచించారు.

## డబుల్ సిక్సర్ కొట్టాం.. మరో సిక్సర్ కొడతారు
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు

**సృజనక్రాంతి/హైదరాబాద్ ::** ఇప్పటికే డబుల్ సిక్సర్ కొట్టామని.. మరో సిక్సర్ సీఎం రేవంత్ రెడ్డి కొడతారని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం అన్నారు. గత రాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదం అని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. అసలు తెలంగాణలో ఫిరాయింపులను మొదలుపెట్టింది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. మీరు ఫిరాయింపులను ప్రోత్సాహించినప్పుడు మీ సోయి ఎటుపోయిందని బీఆర్ఎస్ నేతలపై ఫైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఫామ్ హౌజ్‌కే పరిమితమైన కేసీఆర్.. ఇప్పుడు కహానీలు చెప్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండలేకనే ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని.. గత రాత్రి ఆరుగురు ఎమ్మెల్సీలు హస్తం గూటికి చేరుకున్నారని.. డబుల్ సిక్సర్ కొట్టామని అన్నారు. మరో సిక్సర్ సీఎం రేవంత్ రెడ్డి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్ మీద నమ్మకం లేకనే ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు.

## టీజీపీఎస్సీ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ నేతల యత్నం
### అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు
### ప్రభుత్వ తీరును తప్పుపట్టిన హరీష్ రావు

హైదరాబాద్ : టీజీపీఎస్సీ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయం ముట్టడికి నిరుద్యోగ జేఏసీ నేతలు , ఇతర విద్యార్థి సంఘాల నాయకులు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరగడంతో ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ నోటిఫికెషన్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేసారు. టీజీపీఎస్సీ శాంతియుత ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. ప్రధానంగా మూడు డిమాండ్లతో ముట్టడికి పిలుపునిచ్చింది. గ్రూప్ 2,3 పోస్టులు పెంచి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేసి, అక్టోబర్‌లో 25,000 పోస్టులతో మెగా డీఎస్సీ పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ 1లో 1:100ను అమలుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు. విద్యార్థులను ఎక్కడిక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా, డిమాండ్ల సాధనే లక్ష్యంగా టీజీపీఎస్సీ వద్ద శాంతియుత నిరసన తెలియజేసేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. సోకాల్డ్ ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. తమ గోసను రిప్రెజెంటేషన్ ద్వారా చెప్పుకునే అవకాశం కూడా లేదా అని నిలదీశారు. ఒక వైపు ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ... నిరుద్యోగుల గొంతులను, హక్కులను అణగదొక్కే కుట్రలకు రేవంత్ సర్కారు పాల్పడుతోందని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ ప్రజాపాలన కాదని 'అప్రజాస్వామ్యపాలన' అని ఉద్యోగాల కోసం పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని హరీష్ రావు విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం తిప్పుకుంటే విద్యార్థులకు నిరుద్యోగులకు తోడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు.. డిమాండ్లు సాధించే దాకా.. వదిలిపెట్టమన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున గొంతెత్తుతామని, నిర్విరామ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేయాలని, నిర్బంధించిన వారిని, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు అన్నారు.

## ఎంపిలుగా ప్రమాణం చేసిన అమృతపాల్, షేక్ అబ్దులు రషీద్
### ప్రమాణం కోసం పెరోల్‌పై విడుదల

న్యూఢిల్లీ : జైలు నిర్బంధితులైన, పెరోల్ మంజూరైన రాడికల్ సిక్కు మత బోధకుడు అమృత్‌పాల్ సింగ్, కాశ్మీరీ నాయకుడు షేఖ్ అబ్దుల్ రషీద్ శుక్రవారం లోక్‌సభలో ఎంపిలుగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడానికి పెరోల్ మంజూరైన ఆ ఇద్దరూ పార్లమెంట్ సముదాయంలోను, పరిసరాల్లోను భారీ భద్రత బందోబస్తు నడుమ ఎంపిలుగా ప్రమాణ స్వీకారంచేశారు. ఇంజనీర్ రషీద్‌గా పేర్కొంటున్న రషీద్ యుఎపిఎ కింద నమోదైన ఉగ్ర నిధుల కేసులో ఢిల్లీ తీహార్ జైలులోను, అమృత్‌పాల్ సింగ్ జాతీయ భద్రత చట్టంకింద నేరాలకు అస్సాం దిబ్రూగఢ్ జిల్లాలో జైలులో నిర్బంధంలో ఉన్నారు. వారిని భద్రత సిబ్బంది శుక్రవారం ఉదయం పార్లమెంట్ సముదాయానికి తీసుకువచ్చారు. ఎంపిలుగా ఎన్నికైన ఆ ఇద్దరూ లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఒక ప్రతినిధి తెలిపారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 31 ఏళ్ల అమృత్‌పాల్ సింగ్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి, 56 ఏళ్ల ఇంజనీర్ రషీద్ జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా నుంచి ఇండిపెండెంట్లుగా ఎన్నికయ్యారు. వారు ఇతర విజేత అభ్యర్థులతో పాటు జూన్ 24, 25 తేదీల్లో 18వ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. ప్రమాణ స్వీకారం నిమిత్తం రషీద్‌కు తీహార్ నుంచి పార్లమెంట్ వరకు ప్రయాణ సమయాన్ని మినహాయించి రెండు గంటల కస్టడీ పెరోల్ మంజూరైంది. అమృత్‌పాల్ సింగ్‌కు అస్సాం నుంచి ఢిల్లీకి రాకపోకలు సాగించవలసిన దృష్ట్యా శుక్రవారం(5) నుంచి నాలుగు రోజుల పాటు పెరోల్ మంజూరైంది.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసు
### జుడీషియల్ కస్టడీని జులై 18 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ,జూలై5(ఆర్ఎన్ఎ): ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆమె జుడీషియల్ కస్టడీని జులై 18 వరకు రౌస్ అవెన్యూ కోర్ట్ పొడగించింది. నేటితో కవిత జ్యూడిషల్ కస్టడీ ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను రౌస్ అవెన్యూ కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. కాగా ఏప్రిల్ 11న ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె తీహార్ జైలులో ఉన్నారు. కాగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవి ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తీహార్ జైలులో ప్రశ్నించిన అనంతరం సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను అధికారికంగా సీబీఐ ప్రకటించి, కోర్టుకు కూడా సమాచారం ఇచ్చింది. దీంతో ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే కవిత మరోసారి అరెస్టయినట్టయింది. అటు ఈడీ.. ఇటు సీబీఐ అరెస్ట్ నేపథ్యంలో కవిత చాలా కాలంగా జైలులోనే ఉన్నారు. బెయిల్ కోసం ఆమె చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె దాఖలు చేసిన పిటిషన్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను ట్రయల్ కోర్టు పొడిగించింది. ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు జులై 18 వరకు పొడిగించింది. సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్ శుక్రవారంతో ముగిసింది. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. ఈ కేసులో కవితను సిబిఐ ఏప్రిల్ 11న అరెస్ట్ చేసింది. అంతకుముందే, ఈడి ఆమెను అరెస్ట్ చేసింది. తీహార్ జైల్లో ఉన్న కవితను ప్రశ్నించిన సిబిఐ, ఆ తర్వాత అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈడితో పాటు సిబిఐ కేసులలో కవిత చాలాకాలంగా జైల్లో ఉన్నారు. ఆమె బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టులో తిరస్కరణ ఎదురవుతోంది. కాగా కవితకు బెయిల్ దక్కకపోవడంపై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర నిరాశకు గరవుతున్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో క్రియాశీలక నాయకురాలైన కవిత జైలులో ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక కీలక నేతల జంపింగ్‌లతో బీఆర్ఎస్ సతమతమవుతున్న విషయం తెలిసిందే. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు ఇప్పటికే అధికార కాంగ్రెస్ గూటికి చేరారు. మరో ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపు ఖాయమైనట్టు తెలుస్తోంది.

## నూజివీడు డి ఎస్ పి కార్యాలయానికి
## 5 లక్షలు విరాళం అందించిన కాకాని బాబు

**సృజనక్రాంతి/హనుమాన్ జంక్షన్ (విజయవాడ) :** నూజివీడు డిఎస్పి కార్యాలయం నిర్మాణ పనులకు నూజివీడు ఎమ్మెల్యే రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి సూచన మేరకు హనుమాన్ జంక్షన్ ప్రముఖులు, బాపులపాడు మాజీ ఉప సర్పంచ్ కాకాని బాబు 5 లక్షల రూపాయలు విరాళంగా మంత్రి పార్థసారథి గారి చేతుల మీదుగా గురువారం నూజివీడు డిఎస్పి లక్ష్మయ్య కు అందజేశారు.. డీఎస్పీ కార్యాలయం త్వరితగతిన పూర్తి అవడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి పార్థసారథి కాకాని బాబు ను సన్మానించారు.



## శ్రీ వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్బంగా అన్నదాన కార్యక్రమం

సృజన క్రాంతి /కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామం ప్రధాన రహదారి రోడ్డులో శ్రీ వాసవి సేవాదళ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవాదళ్ సభ్యులు పడకంటి వెంకటేశం, తోట బిక్షపతి, పల్ల నాగరాజు, ఉప్పల రమేష్, ఉప్పల నాగరాజు, శివ కుమార్, శ్రీనివాస్, రాజు, సాయిలు, చక్రి, నందు గౌడ్, అరవింద్, సతీష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## అనునిత్యం ప్రజలకు అందుబాటులోకి ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
### శంభీపూర్ క్రిష్ణ

సృజన క్రాంతి/కుత్బుల్లాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు శంభిపూర్ కృష్ణ సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళు తున్నట్లు తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



## అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

సృజన క్రాంతి/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని కమలమ్మ కాలనీలో గతంలో నిధులు మంజూరై పెండింగ్ వర్క్స్ జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి సమస్య తలెత్తకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షిం చాలని కాలనీ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అగ్రవాసు, వాలి, నాగేశ్వరరావు, రాజుగౌడ్, బాలస్వామి, సాగర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల అరెస్ట్ అన్యాయం
### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ : తమ సమస్యల పరిష్కారం కోసం టీజీపీఎస్సీ వద్ద నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం అమానుషమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో అప్రకటిత ఎమ్జగ్గ÷న్సీ నడుస్తున్నదని విమర్శించారు. ప్రగతి భవన్ కంచెలు బద్దలుకొట్టామని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు హైదరాబాద్ నగరమంతా కంచెలు పాతుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులు శాంతియుతంగా నిరసన తెలుపుతాం అని చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం అభద్రతా భావానికి లోనవుతున్నదని చెప్పారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను రెచ్చగొట్టి వాడుకున్నారని విమర్శించారు. అధికారం చేతికి చిక్కాక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకటించిన పోస్టులకు అదనంగా ఒక్క పోస్టూ పెంచలేదన్నారు. గతంలో ఇదే నోటిఫికేషన్‌ను కుట్రపూరితంగా అడ్డుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు తగులుతుందన్నారు.

## ప్రపంచీకరణ దుష్ఫలితాలపై

# ఉద్యమించిన ఉప్పలధడియం

కవి పరిచయం: ఉప్పలధడియం వెంకటేశ్వర కవి పద్యాలు, కవితలు, గేయాలు మూడింటిపైన అభినివేశం గలిగిన కవి. తెలుగు ప్రాంతం నుండి తమిళనాడుకు ఉద్యోగరీత్యా తరలివెళ్ళిన కవి. 1985వ సంవత్సరం నుండి కవిత్వం విభిన్న రూపాల్లో వెలయిస్తూ తెలుగు భాషకై తపిస్తున్న కవి. డా.పులికంటి కృష్ణారెడ్డిగారన్నట్లు "ఉప్పలధడియం ఒక భావకుడు, ఒక ప్రగతివాది, బహుముఖ ప్రజ్ఞాశాలి". ఈతని కవిత్వంలో అనేక పార్శ్వాలున్నాయి. నేటి సమకాలీన పరిస్థితులను, సంఘంలో జరుగుతున్న అన్యాయ, అకృత్యాలను నిశితంగా పరిశీలిస్తూ, కవిత్వంలో ఆవిష్కరిస్తూ, వాటికి పరిష్కారాలకై పరితపిస్తూ, తనశైలిలో అక్షరాల వెంట పరుగులు తీస్తున్న కవి.

గత కవిత్వ పోకడలు: ఆధునిక సాహిత్యంలో కవులు ప్రకృతిని గూర్చి, ప్రకృతిలో జీవజాలాన్ని వాటి పట్ల చూపాల్సిన భూతదయను గురించి రాశారు. ప్రకృతిని ఆరాధించాలని ప్రబోధించారు. వీరి కవిత్వంలో ప్రకృతిని చూసి మురిసిపోవడమే గానీ భవిష్యత్తులో ప్రకృతికి కలుగబోయే వినాశనాన్ని గూర్చి, పర్యావరణ పరిరక్షణ గురించి, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను గూర్చి చెప్పినట్లు కన్పించదు. ప్రజలను ఎప్పటికప్పుడు ప్రపంచీకరణ గురించి, ఆ దుష్ఫలితాల గురించి ఉదృతంగా చైతన్యపరచే కవులు బహు కొద్దిమందే! వారిలో ఉప్పలధడియం కూడా ప్రముఖంగా తన గొంతును వినిపించినవారే!

ప్రపంచీకరణ నేపథ్యం - దుష్ఫలితాలు: ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఉప్పలధడియం కవిత్వం పరిశీలించే ముందు "ప్రపంచీకరణ" అంటే ఏమిటో స్థూలంగా పునశ్చరణ చేసుకోవలసిన అవసరం ఉంది. "ప్రపంచీకరణ" అనే పదం ఆర్థికవేత్తలచే 1980 నుండి ఎక్కువగా ఉపయోగించబడుతోంది. అయితే, 1990 దశాబ్దంలోగానీ దీని విధానాలు సర్వత్రా వ్యాప్తి చెందలేదు. ప్రపంచీకరణ అనేది సాహిత్యపరంగా చూస్తే స్థానిక లేదా ప్రాంతీయ విషయాలను ప్రపంచ విషయాలుగా మార్చివేసే ప్రక్రియ. పశ్చిమ దేశాలు ప్రభోధించే ప్రపంచీకరణ లక్ష్యం వారి పెట్టుబడులకు ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా అందుబాటులోకి వెళ్లిపోవడం. అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి పెరిగింది. పర్యావరణానికి ముప్పు తలెత్తింది. ప్రపంచీకరణ వల్ల మూడవ ప్రపంచ దేశాలు పట్టును కోల్పోతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు పల్లెల పచ్చదనాన్ని పీల్చేస్తున్నాయి. చల్లని పానీయాల పేరిట విషాన్ని పంచుతున్నాయి. యాంత్రీకరణ, వస్తు సంస్కృతి వ్యామోహం ముసుగులో పల్లెల్ని బలహీన పరుస్తున్నాయి. దీని ఫలితంగా వ్యవసాయ రంగం, చేతి వృత్తులు దెబ్బతిని పల్లెలు పట్టణాలకు వలస పోతున్నాయి. భూమి, నీరు, అడవులు, ఖనిజ సంపద, నదులు, సముద్రాలు మొదలైన వాటిని ప్రకృతి ఇచ్చిన సహజసంపదగా పేర్కొంటాము. సహజ వనరులపై రాజ్యం, ప్రభుత్వాల ఆధిపత్యం ఉండాలని భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో నిర్దిష్టంగా పేర్కొన్నారు. అనగా వీటిని ప్రజల సంక్షేమానికై వినియోగించవలసిన బాధ్యత ప్రభుత్వాలకున్నది. కానీ 1991లో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా సహజవనరులను ప్రయివేటు కంపెనీలకు కేటాయించటం ప్రారంభమైంది. అతి సహజ వనరైన మంచినీరు ఈనాడు అతిపెద్ద "వ్యాపార వస్తువు"గా మారింది. మంచినీటిపై లక్షల కోట్ల వ్యాపారం జరుగుతున్నది.

గళమెత్తిన కవులు: ప్రజలను సంస్కరణలనే భ్రమల్లో ఉంచి, భారతదేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఈ ప్రపంచీకరణ విధానాల స్వరూప స్వభావాలు, రంగు, రుచి, వాసనలు ఎలాంటివో సామాన్య ప్రజానీకానికి తెలియకపోవచ్చు. అధిక ధనాపేక్షతో పెట్టుబడి దారులు మాట్లాడకపోవచ్చు. స్వార్థ రాజకీయ నాయకులు నల్లధనం వెనకేసుకునే ప్రయత్నంలో ఇవన్నీ తెలిసినా తెలియనట్లే ప్రవర్తించవచ్చు. కానీ మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు ఇవన్నీ గమనిస్తూ ఉంటారన్న విషయం మనం మరచిపోకూడదు. అలాంటి కవిత్వం వినిపించి ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ధ్వజమెత్తి, ప్రజలను హెచ్చరించిన కవులలో డా.అద్దేపల్లి రామమోహనరావు, ఉప్పలధడియం, మొదలైన వారు ముందువరసలో ఉన్నారు. అలాగే జూకంటి జగన్నాథం, దర్భశయనం శ్రీనివాసాచార్య, మేళ్ళచెరువు లక్ష్మీకాంతరావు, పైడి తెరేష్ బాబు, వేదుల శ్రీరామశర్మ, ఆశారాజు, అశోక్ కుమార్, అనిసెట్టి రజిత ప్రభృతులు కూడా ప్రపంచీకరణపై ధ్వజమెత్తిన వారే!

మృత్యుద్వీపం-దీర్ఘ కవిత: ఉప్పలధడియం వెంకటేశ్వర "మృత్యుద్వీపం" కవితా సంపుటి పరిశీలించదగినది. ఇందులో 52 కవితలున్నాయి. వాటిల్లో అక్కడక్కడా పద్య కవిత్వం కూడా ఉంది. మినీ కవిత్వం, హైకూలు కూడా ఉన్నాయి. ఇందులోని ఒక దీర్ఘ కవిత "మృత్యుద్వీపం" డిసెంబర్ 1993లో రాయబడినది. ఈ కవిత రెండువందల పంక్తులతో సాగింది. డా.అద్దేపల్లి అన్నట్టుగా "సమకాలీన కృత్రిమ, వంచనామయ, మనవతా రహిత జీవితానికి, హింసాత్మకతకి, విచ్చలవిడి సంస్కృతికి, ధన దాహానికి పొందిన ఆవేదన ప్రత్యక్షర అగ్నిజ్వాలగా సాగిన దీర్ఘ కవిత" యిది. ఈ దీర్ఘ కవితను గురించి విశ్లేషించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

మృత్యుద్వీపం విశ్లేషణ: ఈ కవిత పేరే మృత్యుద్వీపం. ప్రపంచీకరణలో ప్రపంచమే కుగ్రామం అయినట్టుగా మన దేశం మొత్తాన్ని ఒక మృత్యుద్వీపంగా అభివర్ణిస్తాడు కవి. "గతానుభవాన్ని గుండెలో దాచుకొని/ కొండంత ఆశతో చూస్తున్నాను/ కొత్త గులాబీ మొగ్గ కోసం" అంటున్నాడు. కవి గతానుభవాలన్ని నిరాశాపూరితమైనవని, అప్రయోజనమైనవని అర్థం చేసుకోవచ్చు. ఆశ మనిషిని బ్రతికిస్తుంది. బంగారం నాణ్యత అగ్నిలో తెలిసినట్టే, మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది. కష్టాలలో కృంగిపోకూడదు. తినడానికి భోజనంలేని స్థాయి నుంచి తినడానికి సమయమే లేని స్థాయికి ఎదగడమే విజయం. ఆలోచించే మనిషికి ఆవేశం ఉండదు.. ముందుచూపు లేని మనిషికి ఆలోచన ఉండదు కనుక మనిషి అన్నీ కోల్పోయినప్పటికి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అదొక్కటి చాలు, మనం కోల్పోయిన వాటన్నింటినీ తిరిగి దక్కించుకోవచ్చు. యాంటిసిపేటరీ రియలిస్ట్‌లా మరోగులాబీ కోసం ఆహ్వానగీతం పలుకుతున్నాడు.

"సాంకేతిక విజ్ఞానం/ సంస్కార దీపాన్ని వెలిగించలేదు/ నగ్నత్వానికీ నవ నాగరికతకూ/ దేవతా వస్త్రమే తేడా!" అనడం గమనిస్తే సాంకేతికంగా మనిషి ఎంత విజ్ఞాన కాంతిని పొదివిపట్టుకున్నప్పటికీ ఎంత విజ్ఞానాన్ని స్వంతం చేసుకున్నా, సంస్కారం అనే గుణం మనిషికి లేకపోతే అంతా బూడిదలో పోసిన పన్నీరే! నవనాగరికత సమాజం అని మనం దేన్నైతే కోరుకుంటున్నామో, అదంతా ఒట్టి మిథ్య! దేవతావస్త్రం లాగే ఉన్నదని భ్రమల్లో బ్రతకడమే!

"మనమిప్పుడు/ వ్యోమయానం గురించి/ మురిసిపోనవసరం లేదు/ ఆత్మ హననం గురించి/ విశ్లేషించుకోవాలి" అంటున్నాడు కవి. ప్రపంచీకరణ నేపథ్యంలో నాగరికత విషపుకోరలు ఏవిధంగా పల్లెల్నీ, పత్రహరితాన్నీ, ప్రకృతిని మంటగలిపిందో తెలియజేసి బాధను వ్యక్తీకరించాడు. మనం చేస్తున్న వ్యోమయానం గురించి అట్టే మురిసిపోనవసరం లేదని, ఆత్మావలోకనం అవసరమని, మానవీయసంబంధాలు నిలుపుకోవాలని హితవు పలుకుతున్నాడు కవి. "కనుపించీ కనుపించని సంకెళ్ళు/ చుట్టుముడుతున్నై/ జీవనాన్ని కబళిస్తుంది మృత్యుద్వీపం!" మనిషి మృత్యుద్వీపంలో సంకెళ్ళతో నిలబడ్డాడని చరమ సందేశమిస్తాడు కవి.

ముగింపు: రాబోయే కాలంలో సంక్షోభం మరింత తీవ్రంగా వుంటుందని హెచ్చరిక విన్పించినా ముందస్తు జాగ్రత్తలు తీసుకొనుటలో విఫలమై, మానవజీవితాలు అతలా కుతలమయ్యాయి. రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, కార్పొరేట్ దిగ్గజాలు, మాఫియా ముఠాల కూటములు నిస్సిగ్గుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని లాభాల బాటల్లో పయనిస్తున్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించడం వల్ల అవినీతి సర్వవ్యాపితం అయ్యింది. అత్యధిక శాతం ప్రజలు వంచింపబడుచున్నారు. ప్రభుత్వ నిష్క్రియాపరత్వంవల్ల ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత కొనసాగుతున్నాయి. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉద్భవించటం వలన ఆనతి కాలంలోనే ఒక విరుద్ధ పోకడ మొదలయ్యింది. స్థానిక ప్రత్యేకత, వ్యక్తిత్వం మరియు గుర్తింపులకు రక్షణగా ఒక కొత్త జ్ఞాపికను ఇచ్చింది కానీ చాలా మటుకు విజయం సాధించలేకపోయిందన్న విషయాన్ని అనేకమంది కవులు తమ కవితల్లో వ్యక్త పరిచారు.

"తెలుగు భాష, సంస్కృతి, పర్యావరణాలపై ప్రపంచీకరణ జరుపుతున్న దాడిని భాషాభిమానులు, సాహితీవేత్తలు గుర్తించి, అప్రమత్తం కావాలి" అని కేంద్ర సాహిత్యఅకాడమీ పురస్కారగ్రహీత డా.పాపినేని శివశంకర్ ఇచ్చిన సందేశంతో ముగిస్తున్నాను.



– డి.ప్రమీల,
చెన్నై (98405 62560)



### అల్లూరి సీతారామరాజు

ఈవారం కవిత

వీచేగాలి స్తంభించింది
పారే నీరు గడ్డ కట్టింది
ఆకాశంలో ఎగిరే పక్షులు
అలాగే ఆగిపోయినై
నింగిలో నడిచే మబ్బులు
రక్తసంధ్యను పులుముకొని
అలాగే ఉండిపోయినై
దిక్కులన్నీ అడవిదోవల్లో
స్పృహదప్పి వాలిపోయినై
మట్టి అదేపనిగా ధ్వనించింది
మా పోరాటం ఫలిస్తుంది
స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది
సీతారామరాజుకి జై.

ఓడిపోతానని తెలిసికూడా
కడదాకాపోరి
నెత్తురోడి పడిపోవడం
సాధారణ యోధ కథ
ప్రజలమీది ప్రేమతో
ప్రజల్ని గట్టెకించాలని
ఆత్మార్పణ చెయ్యడం
అసాధారణ వీర గాథ
– అదే సీతారామ రాజు
విప్లవ వీర గాథ



(డా.అద్దేపల్లి రామమోహనరావు రచించిన అల్లూరి సీతారామరాజు వచనకవితా విప్లవ వీరకవితా కావ్యం నుండి – అల్లూరి జయంతి 4 జూలై సందర్భంగా – శిష్యుడు డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య సమర్పణ)

## బాబు ఢిల్లీ పర్యటన కాయా? పండా!

(యం.వి.రామారావు,ప్రత్యేక ప్రతినిధి)




రాష్ట్రాభివృద్ధికి నిధుల కోసం ప్రధాని, కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు ఫలించాయా లేక కేంద్రం పాత ధోరణిలోనే పోతున్నదా అనేది ఆయన పర్యటన ఫలితాలతో తేలనున్నాయి. మూడురోజుల పర్యటన నిమిత్తం బాబు ఢిల్లీ వెళ్లిన విషయం విదితమే. ప్రధాని మోదీతో అమరావతి,పోలవరం లపై చర్చించినట్లు,వాటికి నిధుల మంజూరుకు విజ్ఞప్తి చేయడం విశేషం.అలాగే రాష్ట్రంలో వెనుకపడిన ప్రాంతాల అభివృద్ధికి బూందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని ప్రధాని, ఆర్థిక మంత్రితో చర్చించారని తెలిసింది.అదే రోజు రాష్ట్ర పరిస్థితి ని కలిసిన ఏడుగురు మంత్రులవద్ద బాబు ప్రస్తావించడం గమనార్హం. ముఖ్యంగా గడ్కరీ విజయవాడ ఈస్ట్రన్ బైపాస్ రోడ్డు,రాజధాని ఔటర్ రింగ్ రోడ్డులకు అనుమతిపై సానుకూలంగా స్పందించారని సమాచారం.అలాగే ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం నుంచి నిడమానూరు వరకూ ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది.మంత్రులతో పాటు ఆర్థిక సంఘం ఛైర్మన్ ను కూడా కలిసారు. మూడోరోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో గంటపాటు చర్చించారు.రాజ్ నాథ్ సింగ్,నడ్డే తో పాటు నీతి అయోగ్ సీఈవోని కలవడం విశేషం. పారిశ్రామిక దిగ్గజాలను కూడా కలసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. మూడోరోజులు క్షణం వృథా చేయక రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రపెద్దలలో ప్రతిఒక్కరిని కలిసినప్పుడు ఉన్న అప్పులను ప్రస్తావించి ఆదుకోవాలని కోరడం విశేషం. ఇదిలా ఉండగా మాజీ సీఎం జగన్ నెల్లూరు జైలుకు వెళ్లి పిన్నెల్లిని కలిశారు.ఏవీఎంలను ధ్వంసం చేయడం తప్పుకాదని వ్యాఖ్యానించడం గమనార్హం.అలాగే చంద్రబాబు ప్రోత్సాహం తో టీడీపీ శ్రేణులు వైసీపీ వారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించడం గమనార్హం.ఇలాంటి కక్షరాజకీయాలతో బాబు ఎక్కువకాలం అధికారంలో మనలేడనడం విశేషం. జగన్ ఓటమి భారం నుంచి కోలుకుని ప్రభుత్వంపై విమర్శలు ప్రారంభించారు.అలాగే పార్టీ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.ఆ సమావేశంలో ముద్రగడ కూడా ఉన్నారని సమాచారం.ఆయన ఇటీవల తన పేరు పద్మనాభరెడ్డి గా మార్చుకున్న విషయం విదితమే.

### బాబు,రేవంత్ చర్చల్లో 10అంశాలు

శనివారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో బాబు ఇరురాష్ట్రాల సమస్యలపై చర్చించనున్నారు.ముందుగా బాబు రేవంత్ కు లేఖ రాసిన విషయం విదితమే. వీరిమధ్య విభజన అంశాలు ప్రధానంగా చోటుచేసుకోనున్నాయి.ముఖ్యంగా విభజన చట్టం 9,10 షెడ్యూలుపై చర్చలు జరిగే అవకాశం ఉంది.మొత్తంమీద 10అంశాలపై వారు దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది.వీరితో పాటు మంత్రులు,సీఎస్ లు అధికారులు పాల్గొంటున్నారు.గత 10 సంవత్సరాల్లో ఇరు రాష్ట్రాల సీఎంలు కలిసినా ఒక్క అడుగు ముందుకు సాగలేదు. బాబు,కేసీఆర్ ఒకసారి కలిసారు.జగన్ సీఎం అయిన తరువాత కూడా కేసీఆర్ తో చర్చలు జరిపారు. చంద్రబాబు,రేవంత్ గురుశిష్యులు కావడంతో పార్టీలు వేరయినా చర్చలు ఫలించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.సాగునీటి వాటా,విలీన మండలాలు,విద్యుత్ బకాయిలు చర్చల్లోప్రధానంగా చోటు చేసుకోనున్నాయి. ముందుగా విలీనమండలాలు వెనక్కి తెచ్చేలా రేవంత్ బాబును ఒప్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేసారు. అలాగే కృష్ణా,గోదావరి జలాల్లో సగం వాటా సాధించాలని మాజీ ఎంపీ వినోద్ కూడా డిమాండ్ చేసారు.ఏదిఏమైనా వీరిద్దరి మధ్య విభజన సమస్యలు ఒక కొలిక్కివస్తాయని భావిస్తున్నారు. అవసరమైతే కేంద్రం సహాయం తీసుకుంటామని రేవంత్ వ్యాఖ్యానించడం గమనార్హం.ఎక్కడ తగ్గాలోఎక్కడ పెరగాలో తెలిసిన చంద్రబాబు విభజన సమస్యలను పరిష్కరిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు.రేవంత్ కూడా తెలంగాణా అభివృద్ధే ధ్యేయంగా అందరిని కలుపుకుపోతున్న వైఖరి కూడా హర్షనీయం. వీరి చర్చలు ఫలించి శుభవార్తలు వినాలనిఆశిద్దాం.రెండు తెలుగు రాష్ట్రాలు అన్నదమ్ములవలె పరస్పరం సహకారంతో అభివృద్ధి పథం చేరాలని భావిద్దాం.

# బాలసాహిత్యానికి సంక్షిప్తత, సరళత్వం రెండుకళ్ళు

## భాష సరళంగాను, భావం మృదువుగాను వుండాలి

**ప్రముఖ బాలసాహిత్యవేత్త , చరిత్ర పరిశోధకుడు డా. గంగిశెట్టి శివకుమార్ సుదీర్ఘ కాలం బాలసాహిత్య క్షేత్రంలో ఉన్నారు. చందమామ మాసపత్రికలో పని చేసి విశేష అనుభవం గడించి ఈనాటికీ అనేక కథలను వివిధ పత్రికల్లో రాస్తున్నారు. వారితో ఈ వారం కరచాలనం.**

**మీ బాల సాహిత్య ప్రవేశం ఎలా జరిగింది?**

మా స్వగ్రామం రాపూరు.నేను 4వ తరగతి చదివేటప్పుడు మొదటిసారి జిల్లాగ్రంథాలయానికి వెళ్ళాను. మా తండ్రిగారు చందమామ, బాలమిత్ర కొనితెచ్చి నా వద్ద చదివించేవారు. 8వ తరగతి చదివేటప్పుడే మొదటికథ రాసి బాలమిత్రకు పంపాను. పోస్టల్ ఉద్యోగి అయిన నాతండ్రి కథను ఎలా పోస్ట్ లో పంపాలో చెప్పారు. ఆ కథారచనలోకూడ ఆయన సహకారం నాకు లభించింది. మా గ్రామంలోని పెద్దలని కథలు చెప్పమని అడిగి చెప్పించుకునే వాణ్ణి. చందమామ కథలను ఒకటికి పదిసార్లు చదివే వాణ్ణి. అదే నన్ను రచయితను చేసింది. కుటుంబరావు గారి శైలి అంటే నాకు ప్రాణం.

**చందమామ మాసపత్రికలో మీ అనుభవాలు?**

చందమామలో రెండేళ్ళపాటు పనిచేశాను. నాగిరెడ్డిగారి అబ్బాయి బి.విశ్వనాథరెడ్డిగారు. ఆయన నిర్వహణలో చందమామ నడుస్తుండేది. అప్పుడు దాసరి సుబ్రమణ్యంగారు ఎడిటర్. బి.విశ్వనాథరెడ్డిగారి దగ్గర ఎంతో నేర్చుకున్నాను. నా దృష్టిలో ఆయన చందమామ నిర్వహణకు తగినవారు.

**మీ పిహెచ్డీ సిద్ధాంత వ్యాసం బాలసాహిత్యమేనా? ఆ వివరాలు?**

తిరుపతి, శ్రీవేంకటేశ్వవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ రెగ్యులర్ గా చదివి ప్రథమశ్రేణిలో పాసయ్యాను. నా పరిశోధనకు గైడ్ ఆచార్య జి.నాగయ్యగారు. నన్ను ప్రోత్సహించి తెలుగులో బాలకథాసాహిత్యం మీద పరిశోధనకు గైడ్‌గా వ్యవహరించారు. నాదృష్టిలో ఆయన దైవస్వరూపుడు.



**మీరు ఎన్ని పుస్తకాలు ప్రచురించారు?**

దాదాపు 15 పుస్తకాలు. అందులో 12 - బాలసాహిత్యం కథలు. 3 - చారిత్రకగ్రంథాలు.

**మీ సుదీర్ఘ అనుభవంతో "బాలసాహిత్యం - సిద్ధాంతాలు శిల్పరీతులు" అనే గ్రంథం తెస్తే భావితరాలవారికి మార్గ దర్శకంగా ఉంటుంది కదా?**

అలాచేయాలని వుంది. తగిన సమయంకోసం ఎదురుచూస్తున్నాను. డా.వెలగా వెంకటప్పయ్య ప్రోత్సాహంతో దాదాపు 30 సెమినార్లల్లో బాలసాహిత్యంమీద పరిశోధనాపత్రాలు సమర్పించాను. ఉపన్యాసాలూ ఇచ్చాను. ఇప్పటికి ఇస్తున్నాను. ఇటీవల మైసూరులో జరిగిన "గుర్తింపు పొందిన ప్రాచీన భాషల మూడు రోజుల సదస్సు" లో "బాలసాహిత్యం" పై ఒక పత్రం సమర్పించాను. అది అనేకమంది భాషావేత్తల ప్రశంసలు చూరగొన్నది. బాలసాహిత్యమేగాక చరిత్ర, సంస్కృతి, సాహిత్యంమీద నాకు ఆసక్తి ఎక్కువ. ముఖ్యంగా ద్రావిడ భాషలన్నింటిలోని సాహిత్యాన్ని పోల్చుకుంటూ ఆనందిస్తుంటాను.

**బాలసాహిత్యం ప్రస్తుతం సాహిత్య అకాడెమీ అవార్డులు పొందేందుకు సులభ మార్గమైనదన్న కొందరి విమర్శపై మీ సమాధానం?**

ఈ విషయమై మాట్లాడాలనిలేదు.

**బాల సాహిత్య భవిష్యత్తు ఏమిటి?**

బాలసాహిత్యానికి మంచి భవిష్యత్తు వుంది. కొత్తవాళ్ళు చాలామంది రాస్తున్నారు. వారిలో కొంతమంది బాగారాస్తున్నారు.

**మీరు వర్ధమాన కవులకు ఇచ్చే సందేశం సలహాలు?**

బాలసాహిత్యానికి సంక్షిప్తత, సరళత్వం రెండుకళ్ళు. భాష సరళంగాను, భావం మృదువుగాను వుండాలి. చెడుభావాలు, మూఢనమ్మకాలు వుండకూడదు. ఎప్పటికయినా సత్యం, ధర్మం జయిస్తాయి అన్న మౌలికభావాలను రచయితలు బాలసాహిత్యంద్వారా తెలియజేయాలి. మంచి వ్యక్తిత్వం ఏర్పడడంలో పిల్లలకు బాలసాహిత్యం తోడ్పడాలి. పెద్దలు పిల్లల్లో పఠనాభిలాషను పెంపొందించాలి. ఇదే వర్ధమాన రచయితలకు నేనిచ్చే సలహా.

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య (9490400858)